# "వీడని తోడు"

వంటింట్లో పని ముగించుకొని, పుస్తకాల అలమర తెరిచింది చందన. చదువవలసిన ఎన్నో పుస్తకాలు "ఎప్పుడెప్పుడు తమవైపు దృష్టిసారిస్తుందా" అన్నట్లు ఆమెకోసం ఎదురు చూస్తున్నాయి. దేన్ని చేతుల్లోకి తీసుకోవాలి. తనకి లభించిన ఈ కొద్దిపాటి సమయాన్ని ఎలా వినియోగించాలో అని అంతు చిక్కని చందన అన్నింటివైపు చూస్తూ అలానే నిలబడి పోయింది. తనపని ఏది చేసుకొన్నా, వాసు స్కూలు నుండి వచ్చేదాకానే. చందన ఈ ఆలోచనల్లో ఉండగానే కాలింగ్ బెల్ మ్రోగింది. వెళ్ళి తలుపు తెరిచింది చందన.

"అరే! కల్పనా! నువ్వా" స్నేహితురాల్ని ఆశ్చర్యంగా చూసింది చందన.

"అవునే పిక్నిక్‌కి నేను కూడా వెళ్ళటం లేదు. పద కాసేపు కబుర్లు చెప్పుకుందాం" అంటూ తనే చందన చేయందుకొని చకచకా లోపలికి నడిచింది కల్పన.

"నువ్వెందుకాగిపోయినట్టు" సోఫాలో కూర్చోగానే స్నేహితురాల్ని అడిగింది చందన.

"నీకు తెలుసు, మనం మిత్ర బృందంగా ఎంత మందిమి ఉన్నా, నువ్వే నా ప్రాణ స్నేహితురాలివి. నీవు లేని నేను లేను" అంటూ, పాటందుకొంది కల్పన.

చందన ముఖంలో చిరునవ్వు చూసే సరికి కల్పన మనస్సు తేలిక పడింది. ఏమిటో పిచ్చి చందు! ఈ పిక్నిక్‌కి వెళ్ళడం కోసం ఎంత ముచ్చట పడిందో, తీరా ఇప్పుడు ఇల్లు వదిలి కదల్లేని స్థితి. కాలేజీలో చేరినప్పటి నుంచి ఏ ప్రోగ్రాం అయినా ఇలానే మిస్సవుతుంది. ఎవరయినా అత్తారింట్లో అడుగు పెట్టాక ఇంటి కంకితమయి పోతారు. కానీ చందూ మాత్రం సరదాగా ఆడుతూ, పాడుతూ గడపవలసిన కాలేజీ జీవితంలోనే ఇలా ఇన్ని బాధ్యతలు మోస్తోంది. కల్పన ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ చందన దిగ్గున లేచింది.

"ఏమిటే తల్లి ఎక్కడికా పరుగు"

"వాసు వచ్చేశాడు" - ఎలాగమనించిందో? ఇంతటి ఆపేక్ష ఉంది గనుకనే అన్ని సరదాలు ఫణం పెట్టి ఆనందంగా గుడుపుతోంది. వాసూని పెనవేసుకొని లోనికి తీసుకొచ్చింది. మరుక్షణం చందన లోకమే వేరయిపోయింది. అర్థంకాని భాషలో వాసు చేసే గొడవకు, సైగలకు అర్థాలు వెతుక్కుంటూ అనునయంగా ఆ పిల్లాణ్ణి సముదాయిస్తోంది. అన్నం తినిపించి, బట్టలు మార్చి, "కాసేపు నిద్రపోవాలి, లేచాక ఎంచక్కా మనిద్దరం ఆడుకుందాం" నచ్చ చెప్పింది. కాళ్ళతో చేతులతో ఏవేవో విన్యాసాలు చేస్తూ కోపం ప్రదర్శించాడు. తమ్ముడు తన్నినా, రక్కినా చందన రవ్వంత కూడ నొచ్చుకోదు. వాసు స్కూల్‌కి వెళ్ళినప్పుడు తప్పించి తను వాసు ప్రక్కన ఉండవలసిందే ఆ అమాయకపు చేష్టలను ఆనందంగానే భరిస్తుంది. బుజ్జగించి వాణ్ణి తన దారికి తెచ్చుకొనే ప్రయత్నం చేస్తుంది. నిజానికి బడిలో అమ్మ ఒడిలో నేర్చుకొన్నదాని కన్నా అక్క సాహచర్యంలోని వాసు కొంతవరకు మనిషి కాగలుగుతున్నాడు అంటే అతిశయోక్తి కాదు. ఆమెకు సర్వస్వం ఆ తమ్ముడే వాడి కోసం తానేమి చెయ్యాలోనని అహర్నిశలూ ఆలోచిస్తోందే తప్ప మరోవైపు బుద్ధి పోనియ్యదు. అందుకే వయస్సుతో పాటు ఎదగని వాడి మనస్సులో ఒదిగిపోయింది. ఎంత పేచీ పెడుతున్నా, పంతంతో ఎలాంటి అల్లరి పనులు చేస్తున్నా, అక్క కళ్ళతో వారిస్తే చాలు, బుద్ధి మంతుడిలా చేతులు కట్టుకొని నిలబడతాడు.

"అలాచూడు కల్పనక్క వచ్చిందిగా మరికాసేపు మేమిద్దరం కబుర్లు చెప్పుకోవాలి. పుస్తకాలు చదువుకోవాలి మా బంగారు తమ్ముడివి కాదూ"? పదహారేళ్ళు పైబడిన తన గారాల తమ్ముడిని జోకొడుతోంది. తిరిగి మళ్ళీ ఏదో అన్నాడు. తమ్ముని కోరిక అర్థం చేసుకొన్న చందన -

"ఏయ్ కల్పన! ఇలా రావే మా తమ్ముడు నిన్ను పాడమంటున్నాడు" పిలిచింది. కల్పన పాటందుకుంది. వాసు నిద్రలోకి జారుకున్నాడు. కల్పన వాడి ముఖంలోకి తదేకంగా చూస్తుండిపోయింది. మాయం కాని పసితనపు ఛాయలు, జీవన గమనంతో పని లేదన్నట్లు మొలుచుకొస్తున్న నూనూగు మీసాలు మగవారిలో ఇంతటి సౌందర్యానికి తావుందా అన్నట్లు ప్రతీ అవయవంలోనూ పోగు పోసుకున్న అందం, ఆమెను అయోమయంలో పడేశాయి.

"ఏమిటే అలా చూస్తున్నావు. 'టీ' తీసుకో" స్నేహితురాలి మాటకి ఉలిక్కి పడింది.

"ఓహ్! ఎంతలో తయారు చేసేశావే"

"నువ్వే వాసును చూస్తూ కాలం మర్చిపోయావ్"

"అవునే చందూ" తన మనస్సులో మాట స్నేహితురాలితో అంది."

"నిజమే నేనూ అలానే ఆలోచిస్తాను. ఈ ప్రపంచంతో సంబంధం లేదు వీడికి. మా వాసే కనుక మామూలు మనిషే అయివుంటే నువ్వన్నట్లు నవమన్మథుడిలా ఉండేవాడు. వాడికంటూ ఒక జీవితం వుంటే ఎంతో ఉన్నతస్థాయికి ఎదిగి అమ్మా, నాన్నల్ని ఎంత సంతోష పెట్టేవాడో,

తలుచుకొనే కొద్దీ తరుముకొస్తుందే దుఃఖం" క్షణంలో చందన కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. "సారీనే నిన్ను బాధ పెట్టాను. లే హాల్లోకి పోయి కాసేపు పుస్తక ప్రపంచంలో విహరిద్దాం". సున్నితంగా నెచ్చెలి కళ్ళు తుడిచింది.

ఆ పూటంతా స్నేహితురాలితో గడిపింది.

"ఇంక" వెళ్లొస్తానే చందూ!"

"సరేలే నువ్వు మాత్రం ఎంతని కంపెనీ ఇస్తావు. నాకోసం పిక్నిక్ మానుకున్నావ్".

"ఆ మాటే అనొద్దంటాను. నీ, నా, పక్కన పెడితే మనం అవుతామే! నేను వెళ్తాను" అంది.

"మా తాతయ్యకూడ ఇంట్లో ఒక్కడే ఉండలేడని, అమ్మా, నాన్న ఏరాత్రికో వస్తారు. నే కళ్ళపడేవరకూ... ఊరికే బెంగపడి పోతాడు తాతయ్య! నిజానికి మీ వాళ్ళు వచ్చేవరకు ఇక్కడే ఉండిపోవాలనిపిస్తుంది".

"చాల్లేవే మరీ చెబుతున్నావ్ నీకు మాత్రం ఎలా కుదురుతుంది. ఒకరి జీవితంలో వెలితిని మరొకరు తీర్చేయటం తెలికా?" చందన పేలవంగా నవ్వింది.

"పిక్నిక్ పేరుతో ఈ సమయమంతా నాతోనే గడిపావు. నిర్మలమైన నీ స్నేహం నా మనస్సుని అర్థం చేసేస్తోంది అంది.

"పిచ్చి చందూ! నేనేం చేయగలుగుతున్నానే నువ్వు పిక్నిక్‌కి రావటం లేదు అనుకున్నానే తప్ప, నిన్ను ప్రాణంగా అభిమానించే బావ పెళ్ళి మిస్ అయ్యావనుకోలేదు. నువ్వు ప్రక్కన ఉంటేనే గాని పెళ్ళి చేసుకోనని మీ బావ పట్టుబట్టాడన్నావు. అలాంటిది ఇంటికే కట్టుబడి పోయావ్"

"అబ్బబ్బ! పదే పదే అలా అనకే. అమ్మో, నేనో వాసుకోసం ఉండాలిగా! అమ్మయితే నన్నూ నాన్నను వెళ్ళమంది. కానీ... నువ్వు వెళితేనే వాళ్ళకి చేదోడు, వాదోడుగా వుంటావ్ అని, నేనే బయల్దేరదీశాను. బావ తెల్లవారేసరికి చెవులో ఒకటే పోరు పెట్టేశాడనుకో ఎంత బ్రతిమాలినా వినిపించుకోండే. "నువ్వూ వచ్చి తీరాలని, లేకపోతే నేను పెళ్ళిపీటల మీద కూర్చోనని" ఫోన్‌లో పసిపిల్లాడిలా మారాం చేశాడు. నా శుభాకాంక్షలు నీ మనసులో ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి. మీ జంటను చూడ్డానికి తొందరలోనే వస్తానని ఒప్పించి ఫోన్ పెట్టేశా గానీ నా మనస్సు ఎంత చిన్న బోయిందే. నువ్వొచ్చాకనే కాస్త మరచి పోగలిగాను" అంది చందన. స్నేహితురాలిని సాగనంపి, తమ్ముని పనులలో లీనమై పోయింది.

"ఏం తల్లీ వీడు నీ ప్రాణాలు తోడేశాడా?" గుమ్మంలో అడుగు పెడుతూనే పద్మావతి ప్రశ్నించింది. పద్మావతి ఎప్పుడూ వాసూ బాధ్యత చందనపై వదిలి వెళ్ళినా ఇలా అడగటం

పరిపాటే అమ్మ అలా ప్రేమగా అడిగినప్పుడల్లా, చందనకనిపిస్తుంది. పూస గుచ్చినట్లు వాడి వెర్రి మొర్రి చేష్టలన్నీ అమ్మతో చెప్పేయాలి, తనకి వీడి బాధ్యత అప్పగించవద్దు. అని సూటిగా అనేయాలని.... మరుక్షణమే వీడు తన తమ్ముడు... వాడికోసం తను ఏమైనా చెయ్యాలి.... ఆ కళ్ళలోని నిర్మలమైన ప్రేమ, తెలిసీ తెలియక వాడు చేసే పాడు పనుల్లో ప్రతిఫలించే పసితనం తన ఊహల్ని మార్చేస్తాయి. అందుకే తనెప్పుడూ తల్లికి ఇలానే బదులిస్తుంది.

"ఛఛ వాడేం చేస్తాడమ్మా! పాపం నే చెప్పినట్లే వింటాడు" అనేస్తుంది.

ప్రత్యేకించి అడగాలా నువ్వడిగితే మాత్రం అది చెబుతుందా? నిద్రలేక ఎర్రబడ్డ దానికళ్ళు చూస్తే తెలుస్తోందిగా, చూడు పిల్ల ఎలా అలిసిపోయిందో!! మగ బిడ్డ కావాలని ఎంతగానో ఎదురు చూసి, వీడు పుడితే తెగ సంబరపడిపోయాం. దేవుడు వరమిచ్చినట్లు ఇచ్చి ఇదిగో వీడి రూపంలో శాపంగా మార్చాడు. ఫలితం కన్నందుకు మనమే కాదు, ఈ లేత వయస్సులో నా చిట్టి తల్లి కూడ అనుభవిస్తోంది." భార్యను కొరకొరా చూస్తూ అన్నాడు రంజిత్. ఉబికి వస్తున్న కన్నీటిని ఆపే ప్రయత్నం చేస్తూ లోపలి కెళ్ళిపోయింది పద్మావతి. "మరీ ఏంటి నాన్నా! నీవు, నీ మాటలు తమ్ముడేం కావాలని విసిగించటం లేదు. అర్థం కాని అయోమయపు బ్రతుకు అయిపోయి కానీ తెలిసి ఈ పాడుపనులు చేస్తున్నాడా? ఎంత ఎదిగినా వాసు పసివాడే. నేనలానే అనుకుంటాను తమ్ముణ్ణి. అలసట గిలసట నాకేమీ ఉండవు. ఊరికే భగవంతుణ్ణి నిందించడం, అమ్మను కోప్పడటం, మానేయాలి" అనేసి తనూ తల్లి వెనుకే వెళ్ళింది. "ఇంతకీ పెళ్ళి ఎలా జరిగిందమ్మా!? అత్తయ్యవాళ్ళు ఏమన్నారు? పెళ్ళికూతురు ఎలా ఉంది." దిగులుగా ఉన్న తల్లితో కబుర్లు చెప్పసాగింది. అమ్మమూడ్ మార్చగలిగింది కానీ, నాన్న మాటలు తన చెవుల్లో రింగుమంటున్నాయి. తన పట్ల అంత ఆపేక్ష వుంది కనుకనే అన్నీ పసిగట్టేస్తాడు నాన్న అన్నట్లు తను ఒక్కర్తి వాడితో వేగలేకపోయింది. చిందర వందర చేసిన వస్తువులన్నీ సర్ది డ్రాయింగ్ రూమ్ నీట్‌గా చేసేసరికి, వంటింట్లో ఫ్లాస్కు పగలగొట్టాడు. అలమరలో డబ్బాలన్నీ తిరగదోసి, పప్పులన్నీ, కలగలుపు చేశాడు. వాటిని వేరు చెయ్యమని ఎల్లమ్మని ఎంత బ్రతిమాలిందీ!! ఎలా అయినా రవ్వంత అర్థం చేసుకొంటాడనీ కాస్త కోప్పడిందో లేదో దేవుడి దగ్గరకెళ్ళి పటాలన్నీ విసిరి పారేశాడు. "నువ్వు తిడుతున్నావనీ దేవుడితో చెప్పానులే." పలికీ పలకని మాటలతో నావైపు గర్వంగా చూశాడు. నాన్నగారి దాకా ఇవేవీ రాకూడదని తను జాగ్రత్త పడింది. పగిలిన పటాలకి అద్దాలు వేయించటం, ఫ్లాస్కికి రీఫిల్ వేయించటం, అన్నీ ఎప్పటిలా అమర్చేసి తృప్తిగా ఊపిరి పీల్చుకుంది. తనకి విశ్రాంతి లేక పోవటాన్ని పోల్చేశాడు. అమ్మ మీద ఎగిరి పడ్డాడు. పాపం! అమ్మ ఏం చేయగలదు? అమ్మ బాధ, వాత్సల్యం, జాలి రూపాల్లో వాసూ మీద వర్షిస్తే, నాన్న ఆవేదన వాడిపైన కోపం, ద్వేషం అయి మొలుచుకొస్తుంది. ఇద్దరూ కన్నబిడ్డ ఇలా ఉన్నాడే అని కుమిలి పోతున్నారు.

తనవంతు ఊరట తను కలిగించాలి. ఎదురయ్యే కష్టనష్టాలు తనే తట్టుకోవాలి. అందుకు శక్తి సామర్థ్యాలు ప్రసాదించమని ఎప్పుడూ భగవంతుణ్ణి వేడుకొంటుంది.

ఏ ఆడపిల్లైనా తనవారిని వదిలి అత్తవారింటికి కదలిపోయే తరుణం హృదయాన్ని బరువెక్కిస్తుంది. ఆత్మీయులకోసం కన్నీరై కరిగిపోతుంది. అదే స్థితిలో ఉంది. ఆ నూతన వధువు. తల్లి తండ్రుల్ని విడిచి ఊరు వదిలేదికాదు. దేశాన్నే వదిలి వెళ్ళిపోతోంది. తన మనసుకు దగ్గరయిన వాళ్ళందరిని కళ్ళనిండుగా చూడటానికయినా, హృదయంలోని ఆత్మీయతను పంచుకోవటానికైనా తను మళ్ళీ పుట్టిన దేశంలో కాలుపెట్టడానికి సంవత్సరాలు పట్టవచ్చు. క్షణమే ఒక యుగమనిపిస్తుంటే ఏళ్ళు ఎలా గడపగలదు. తన వారందరికంటె ప్రాణ స్నేహితురాలయిన చందనను విడిచి వెళ్ళటానికి కష్టంగా ఉంది కల్పనకి. తను దూరమైతే ఒక రకంగా చందన ఒంటరిదైపోతుంది. తమ ఇద్దరి సాహచర్యం అలాంటిది. తనకు పెళ్ళి నిశ్చయమైనప్పటినుండి చందన ఎంత వ్యక్తపరచకూడదని ప్రయత్నించినా దాగని ఆ భావాన్ని దాచలేకపోతోంది. చందన మనఃస్థితిని ఊహించిన కల్పన మనోవేదన మరింతగా ఇనుమడించింది. ఎయిర్‌పోర్టులో అంతా తనకు వీడ్కోలు చెబుతున్నారు. చందన మాత్రం మౌనంగా స్నేహితురాలి కళ్ళల్లోకి చూస్తూ నిలబడి పోయింది. స్నేహితురాల్ని వాటేసుకొని కన్నీళ్ళు పెట్టుకొంది కల్పన. "నిజం కల్పన నీవు దూరమై పోతున్నావు. ఈ ఒంటరి తనాన్ని నేనెలా భరించగలనే" చందన కన్నీరైపోయింది. కన్నకూతురు అత్తారింటికి వెళ్తున్న బాధ మాయమై కల్పన తల్లి కాంతమ్మకు ఆ స్నేహితురాళ్ళ తీరుకి నవ్వొచ్చింది. సున్నితంగా ఇద్దరినీ విడదీస్తూ, చందనను దగ్గరకు తీసుకొంది. "పిచ్చిపిల్ల! ఇవాళ మా అమ్మాయి వెళ్తోంది. రేపు నీకో మొగుడు రాడా, నిన్ను పూల రథంలో తీసికెళ్ళి పోడా - ఎవరెక్కడ ఉంటేనేం మీరిద్దరూ ప్రాణస్నేహితులు' అంది. తొలిసారిగా చందనలో కన్నెమనసు మేలుకొంది. ఫలితం ఆమె పెదాలపై చిరునవ్వు "అదీ! కాబోయే పెళ్ళికూతురా! ఇలా కళకళా నవ్వాలి." చందన బుగ్గన చిటికేసింది కాంతమ్మ. ప్రియ స్నేహితురాల్ని ఎగరేసుకొని ఆకాశ మార్గాన ఎగిరిపోయాడు. ఆమె మనోహరుడు.

కాంతమ్మ మాటలు చందన కళ్ళకు కలలు నేర్పాయి. ఎదలో చిలిపి ఊహలు రెక్కలు విప్పాయి. తనకోరిక చిగురు వేస్తుంటే పెళ్ళిచూపుల ప్రహసనాలు ప్రారంభమయ్యాయి. తనని చూసిన వాళ్ళలో ఒకరిద్దరు తన ఎదలో వలపు వీణలు మీటారు. అలాంటప్పుడు ఇల్లాలుగా అనుభూతమయ్యే జీవన మాధుర్యాన్ని గుండెలో నింపుకొనేది. బ్రతుకుని పండించే ప్రణయాన్ని గురించి పడతి బ్రతుక్కి, పరిపూర్ణత నిచ్చే మాతృత్వాన్ని గురించి తీయ తీయని తలపులు ఆమెను ఉక్కిరి బిక్కిరి చేసేవి. కల్యాణ గడియకు కాలం కలసిరావాలి. చూసి వెళ్ళిన వాళ్ళంతా కాస్త ఛాయ తక్కువనో, కట్నం చాలదనో ఇలా ఏదో వంకన కాదనటంతో చందన

రంగుల కలలు ఫలించే తరుణం దూరమైపోతోంది. "పద్మావతి లేదామ్మా"! తలుపు తెరిచిన చందనను చూస్తూ అడిగింది మీనాక్షమ్మ. "అమ్మా, నాన్న గుడికెళ్ళారు కూర్చోండి." "నేను ముందే అనుకున్నాలే ఆవిడ ఎప్పుడు ఇంటి పట్టున ఉంటుంది కనుక. కుంచమంత కూతురుంటే, మంచంమీదే కూడు అన్న సామెత అక్షరాలా నిజమైంది. రత్నం లాంటి కూతుర్ని కని అదృష్టవంతురాలైపోయింది మీ అమ్మ" సోఫాలో చతికిలబడుతూ అంది. ఊరుకోండి పిన్నిగారూ! మా అమ్మ అదృష్టం ఏమని చెప్పాలి పగలంతా ఆఫీసు పని, మా వాసూ ఎప్పటికీ పసిపిల్లవాడే. రాత్రి అమ్మను నిద్రపోనివ్వడు ఇరవై ఏళ్ళు నిండిన కొడుకు, ఎదగని మనస్సుతో ఎందుకూ పొందని బ్రతుకు గడుపుతూ ఇంట్లో తిరుగాడుతుంటే ఆ తల్లి ఆవేదన ఎంతటిది పిన్నిగారు! అయ్యోరామ!" బుగ్గలు నొక్కుకుంది ఆవిడ. ఈ మధ్య నా కోసం కూడ తెగ బెంగపడిపోతున్నారు. "ఆహా! ఇంటెడు చాకిరీ చేస్తూ లెక్చరర్‌గా అటు ఉద్యోగం చేస్తూ, ఇటు ట్యూషన్స్‌లో సంపాదించి పోస్తున్నావు గానీ, నీ విషయంలో ఎందుకమ్మా బెంగ". వెటకారంగా అంటూ అదోలా నవ్విందావిడ. "మీకు ఎగతాళిగా వుందా పిన్నిగారూ?" 'కాకపోతే నువ్వు సమర్థించుకుంటున్నావు గానీ, తాళి బొట్టుతో కళకళలాడాల్సిన పిల్లవి మగరాయుడిలా వీధిన పడి ఉద్యోగం చెయ్యటం, ఆ పిచ్చి వెధవకి, నే అన్నానని కాదు ఎంత దబ్బిచ్చినా, ఏ పని మనిషి చెయ్యని సేవలన్నీ చెయ్యటం.' ఆవిడ మాటలతో ఒళ్ళు కంపరమెత్తిపోయింది. ఆవిడ కళ్ళలోకి తీక్షణంగా చూసింది. "నన్ను మింగేసేలా చూస్తావేం ముప్ఫై ఏళ్ళు ముంచుకొచ్చేశాయి. పెళ్ళిచూపుల పేరు మీద మీవాళ్ళు ఆడుతున్న నాటకాలు తప్ప, కన్న కూతుర్ని అత్తారింటికి పంపాలని వాళ్ళనుకొంటే క్షణాల్లో జరిపించగలరు పెళ్ళి. నీకేం తక్కువ నేనే కాదు అందరూ.... నీ గురించి ఇలాగే అనుకొని బాధపడుతున్నారు." ఆమె ముఖ కవళికల్ని గమనిస్తూ చెప్పుకుపోతోంది. ఉబికే కన్నీటిని అతి ప్రయత్నం మీద ఆపుకుంటూ పెదవి కదిపితే తననోట ఏమాటలు వచ్చేస్తాయో అని మౌనంగా ఉండిపోయింది. బిగుసుకొని నిలబడ్డ చందనను లాలనగా పెనవేసుకొని ప్రక్కన కూర్చోబెట్టుకుంది మీనాక్షమ్మ. ఆవిడ ధోరణి మొదటిలో వెగటుగానే అనిపించినా ఆ మాటల్లో తన తల్లిదండ్రుల నిజస్వరూపాలేవో గోచరించినట్లు అనిపించసాగింది. తను చెప్పదలుచుకున్నది పూర్తయ్యాక "ఇక వెళ్తానమ్మా. నేనెంత సేపు కూర్చున్నా చెప్పాగా మీ అమ్మరాదు. గుడికి అటునుంచి అటు సినిమాకి, హోటల్‌కి వెళ్ళి కానీ వస్తుందా!! చెట్టావట్టాలేసుకొని ఈ వయసులో కూడ మీ అమ్మానాన్న ఇలా తిరగ్గలుగుతున్నారంటే, మాటి మాటికి నేననటం ఎందుకులే." అనేసి వెళ్ళిపోయింది. బరువెక్కిన హృదయంతో భారంగానే అడుగులు వేస్తూ వీధి తలుపు మూసేసింది. మంచం మీద వాలిపోయి తలగడలో ముఖం దాచుకొని దుఃఖం తీరేదాకా ఏడ్చింది. "పిన్ని మాటలన్నీ పచ్చినిజాలే, అమ్మా నాన్నా అంటే అభిమానంతో, తమ్ముడిమీద జాలితో తన గురించి ఆలోచించుకోలేదు.

తన జీవితం కేవలం ఈ కుటుంబంలో ఒక సభ్యురాలిగానే కరిగిపోతోంది. నూతన వధువై, వరునితో ఏడడుగులు నడిచి అతనిలో సగమై పరవశించి, సరిక్రొత్త జీవన పథంలోకి కాలు మోపే సుముహూర్తం ఏది? తను నమ్ముకున్న వాళ్ళే తనకు అన్యాయం చేస్తున్నారు. ప్రేమ పాశం మమత అంటూ తను ఇంటికి అంకితమై పోతున్న కొద్దీ తల్లి, తండ్రులే తననొక, మరబొమ్మలా ఉపయోగించుకొంటున్నారు. తనొక పిచ్చివాడికి ఆయా కాదు. సంపాదించి పోసే యంత్రం కానేకాదు. ఈ ఇంటికి వంట మనిషి అంత కన్నా కాదు. వీటన్నిటినుంచీ విముక్తి కావాలి. ఈ పసిడి సంకెళ్ళు తెంపుకొని తీరాలి. నాలుగు రోజులుగా చందన మనసులో ఇదే మథనం.

పులిమీద పుట్రలా తల్లి, తండ్రుల విహార యాత్రలు చందనను మరింత తీవ్రమైన అలజడికి గురి చేశాయి. ఎదిగిన కూతురు ఇంట్లో తిరుగాడుతుంటే ఆ తల్లి, తండ్రులకు కంటినిండా నిదురే కరువంటారు. అమ్మాయి పెళ్ళి జరిగేదాక నిశ్చింతగా ఉండలేరట. సుఖ, సంతోషాలకు దూరమై పోతారట. అలాంటిది వీళ్ళు ఎంత గుండె నిబ్బరంతో వున్నారు. పేరుకే తన పెళ్ళి చూపులు. ఏదీ కలిసి రానివ్వరు. ఆలోచనలతో తలపగిలి పోతోంది. తను జీవితంలో ఏదో కోల్పోయింది. ఏదో ఏమిటి తన జీవితమే పోగొట్టుకొంది. "చందనా! ఇదేమిటమ్మా భోజనం చేయకుండా పడుకున్నావ్? వంట్లో నలతగా వుందా?" ఆత్రంగా దగ్గరకొచ్చి ఆప్యాయంగా నుదుటిపై చెయ్యి వేసింది తల్లి. "ఇలా అయితే ఎలా అమ్మా! ఎంత రెండు వారాల్లో వచ్చేయమా!' ఆలనగా కూతురు చేయి పట్టుకున్నాడు, తండ్రి రంజిత్. కన్నవారి స్పర్శ ముళ్ళ కంపలా తోచింది. దిగ్గున లేచి అంది. "నేను బాగానే ఉన్నాను. ఏటేటా మీరు L.T.C. పేరుతో ఇలా తీర్థయాత్రలో, విహారయాత్రలో చేయటం లేదా, మీరు వెళితే నేను ఇంట్లో ఉండటం, తమ్ముణ్ణి చూసుకోవటం పరిపాటేగా" పద్మావతీ, రంజిత్ చందనను విస్మయంగా చూశారు. తనకదేం పట్టలేదు. డైనింగ్ టేబిల్ దగ్గరికి వెళ్ళిపోయింది. చందన దేని గురించో కలవరపడుతోంది, అనునయంగా అడిగి తెలుసుకోవాలి, తన చిట్టితల్లి దేనికీ కలత పడకూడదు. కూతురు ప్రక్కనే కూర్చొంటూ అనుకొన్నాడతను. ఒక్కసారిగా చందనలో ఇంత మార్పు ఎలా వచ్చింది. తన యిల్లు, తన తమ్ముడే తనలోకం అన్నట్లు ప్రవర్తించే చందన వింతగా మాట్లాడుతోంది. ఏదో కారణం ఉండి ఉండాలి. వడ్డిస్తూ అనుకుంది పద్మావతి. తలిదండ్రుల ఎదురుగా తను ప్రవర్తించిన తీరుకి తనను తను తిట్టుకుంది. తనలోని ఉడుకు రక్తం మౌనంగా ఉండనీయలేదు. పెల్లుబికే ఆవేశాన్ని అణచుకోలేక పోయింది. దీనివల్ల ప్రయోజన మేమిటి? సమస్యల్ని సరైన మార్గంలో పరిష్కరించుకోవాలి. అమ్మా, నాన్నలు అయి ఉండి తన విషయంలో వాళ్ళెంత చాకచక్యంగా వ్యవహరిస్తున్నారు. తనూ అలాగే పట్టుచిక్కకుండా ఈ సమస్యను పటాపంచలు చేసుకోలేదా? మానవత్వాన్ని మింగేసే విచిత్రమైన ఆలోచన ఆమె మనసులో అంకురించింది. తన ఆలోచనకు.... ఆకృతి ఇచ్చి అమలు

జరుపగలిగితే, తన బ్రతుకు మాగాణిలో పచ్చని ప్రణయాన్ని పండనీయకుండా పట్టి పీడిస్తున్న చీడ వదిలి పోతుంది. ఆ నిశ్చయానికొచ్చాక చందన తన సహజ ధోరణిలో జీవించ కలుగుతోంది. తల్లి, తండ్రుల ప్రయాణ సన్నాహాలు అన్నీ తనే చేస్తోంది. తమ్ముణ్ణి ఎప్పటికన్నా మరింత లాలనగా చూస్తోంది.

ఆమె చేయాలనుకుంటున్న ఘోర కృత్యం ఆమెను ఏమాత్రం భయభ్రాంతురాలిని చెయ్యటం లేదు. ఆందోళనకి మనస్సు తీవ్రమైన అలజడికి గురికావటం లేదు. ఆ సమయం కోసం హాయిగా ఎదురుచూస్తోంది. తన తమ్ముడు ఉత్త వెర్రిబాగులవాడు మాత్రమే కాదు. శుద్ధ అమాయకుడు కూడా. తనంటే వల్లమాలిన యిష్టం. "ప్రేమతో విషమైనా తాగించవచ్చు అంటారు" అనారోగ్యం పాలైనప్పుడు అమ్మా నాన్న ఎంత బ్రతిమాలినా మందు మాత్రమే వేసుకోడు. తను దగ్గరికి తీసుకొని నచ్చచెప్పి నోటికందిస్తే చప్పున మింగేస్తాడు. అలాగే గుట్టుగా గుప్పెడు మాత్రలు మింగించేసిందా అంతే తనకు తగిలిన గుదిబండ మచ్చుకైనా లేకుండా మాయమై పోతుంది. ఆపై తన జీవితం తనది. ఇలా ఆలోచిస్తున్న చందన చెవుల్లో తల్లిదండ్రుల సంభాషణ పడింది. తన ప్రస్తావన రావటంతో మెల్లగా వినిపిస్తున్న వారి మాటలు ఆసక్తిగా వినసాగింది.

'రేపే పెళ్ళి ముహూర్తం పెట్టించేయండి. ఎల్లుండే మన ప్రయాణం. మరొక్కసారి ఆలోచిద్దాం పద్మా! కట్నమే లక్షన్నర అడుగుతున్నారు. లాంఛనాల పేరిట వాళ్ళ గొంతెమ్మ కోరికలు జాబితా క్రోటన్స్ మొక్కలా పెరిగి పోతోంది కదా! మధ్య తరగతి వాళ్ళం, తట్టుకోగలం అంటావా?" "అలా అనుకునే నేను అమ్మాయితో అనలేదు. మీరనేదేమిటి, వాళ్ళు చూసి వెళ్ళగానే, అమ్మాయి ఏమంది! వాళ్ళు ఒప్పుకొంటే ఆ అబ్బాయిని చేసుకోటానికి తనకి అభ్యంతరం లేదని చెప్పలేదూ!" మూడు నెలల క్రితం ఆ తతంగం గుర్తుకు వచ్చి, "అవును పద్మా కానీ కనీసం ఐదు లక్షలైనా సమకూర్చుకోవాలి. మనకి తగిన సంబంధం దొరక్క పోతుందంటావా?" "అబ్బబ్బ! మళ్ళీ అదే మాట కింద, మీదా పడి కానిచ్చేద్దాం. తర్వాత మన బ్రతుకులు ఏమౌతాయి అన్న దిగులు" పెట్టుకోవద్దంది. "నీయిష్టం పద్మా! అమ్మాయి సుఖం కంటే మనకేం కావాలి!"

ఇక వినలేక పోయింది. చందన నిలువెల్లా కంపించి పోయింది. తనెంత పొరబడింది. దేవతా మూర్తుల్లాంటి తల్లి, తండ్రుల్ని ఎంత అపార్థం చేసుకుంది. ఇక ఆ రాత్రి కునుకు పట్టలేదేమో, తననో ఇంటిదాన్ని చెయ్యాలన్న నిశ్చయంతో అమ్మా! నాన్నలు నిశ్చింతగా నిద్రపోయారేమో, వాళ్ళ మాటలు ఆగిపోయాయి. తామిద్దరూ రాత్రే అనుకున్నట్టు సిద్ధాంతి దగ్గరికి బయలుదేరబోయాడు రంజిత్ "ఒక్క క్షణం ఆగండి నాన్నా!" అంది చందన. "నువ్వు చెప్పేదేదో తర్వాత చెబ్దువు గానీ, నాన్న గారిని ఆపకు, నీ పెళ్ళి ముహూర్తం నిర్ణయించటానికి

వెళ్తున్నారు. ఇలాంటి శుభ కార్యాలకి వెళ్ళేటప్పుడు వెనక్కి రాకూడదు." "అందుకే ఆగమంటున్నా" తల్లిమాటను పూర్తి చేసింది. చందన చెప్పిన విషయం వింటూ నిశ్చేష్టులైపోయారు దంపతులు రంజిత్, పద్మావతి. "నీ నిర్ణయం సరైనది కాదమ్మా!" కాస్త తేరుకొని అన్నాడు రంజిత్ "వాడి కోసం నీపెళ్ళి మానుకోవటం ఏమిటే మేం ఉన్నాంగా" "నా నిర్ణయానికి తిరుగులేదమ్మా వాసు నాకు తోడబుట్టాడు. నాకన్నింటి కంటే అక్కగా వాసుని ప్రేమించటంలోనే నాకు సంతృప్తి దొరుకుతుంది" అంది. తల్లిదండ్రుల కళ్ళల్లోకి నిశ్చలంగా చూస్తూ. అప్పటికే చందన తన మనస్సుని ప్రక్షాళన చేసుకుంది. "గోరంత దీపం కొండలకి వెలుగు కదా". అలాగే తను కన్నవాళ్ళకు, తోబుట్టువులకు వెలుగు కావాలి. అదే తన జీవితానికి సార్థకత కావాలి అలా అనుకొని గుండె నిండా ఊపిరి పీల్చుకుంది చందన. నువ్వంత పట్టుదలకిపోతే బ్రతుకంతా ఈ రంపపు కోత భరించటం మా వల్లేకాదే తీక్షణంగా అంది పద్మావతి. "పెళ్ళి చెయ్యకుండా కూతుర్ని ఇంట్లోనే ఉంచుకున్నాడు. అని లోకం ఆడిపోసుకోవడం ఒక ఎత్తు. ఏ ముద్దూ, ముచ్చట లేకుండా నువ్వు మోడులా పడి వుంటే చూడలేం తల్లీ. లేనిపోని ఆలోచనలతో నీ బ్రతుకు పాడుచేసుకొంటావెందుకు" మృదువుగా మందలించాడు రంజిత్.

"సరే మీ యిష్టం. అయితే ఒక మాట కనీసం మీ తర్వాత అయినా తమ్ముణ్ణి నాతో ఉంచుకోనిచ్చే సహృదయుడు తటస్థపడితే తప్పక చేసుకొంటాను." అనేసింది. కూతురు అంత తీవ్రమైన నిర్ణయం తీసుకోగలదని ఆమె గుండెలో తమ్ముడి పట్ల అంతటి వాత్సల్యం ఉందని, ఇంత త్యాగం చేస్తుందనీ వాళ్ళ ఊహకి అందలేదు. తమకన్నా ఎంతో ఎత్తుకు ఎదిగిపోయిన తమ చిన్నారిని అవ్యక్తానురాగంతో, ఆనంద భాష్పాలతో అభిషేకించారు. ❑